# భాగీరథి

## శ్రీమతి శ్రీమ

తెలతెలవారుతున్న సమయం.

రాత్రి చంద్రుని కనుసన్నలనుండి ఉదయపు రేఖ జారి మల్లెలా విచ్చుకుంటున్న వేళ.

చీకటి తెరలను ఆఖరి వంటరి నక్షత్రం. మెల్లగా పైకి తీసుకుంటున్న సమయం.

తాను నిష్క్రమించవలసిన సమయం ఇది అనుకుంటూ వంటరి నక్షత్రం తన చివరిచూపు క్రిందికి జార్చితే—

"రఘుపతి రాఘవ రాజారాం
పతీతపావన సీతారాం
ఈశ్వర అల్లా తేరానామ్
సబ్‌కొ సంపద దే భగవాన్"

అనేక దీన కంఠాలుకలసి పాడుతున్న ఆ శ్లోకం శబ్దమై గాలితో చెలిమిచేసి తరంగాలుగా మారి, మందిర ప్రాంగణం దాటి పుడమి తల్లికి నమస్కరించి ఆకాశంవైపు శాంతిదూతల్లా ప్రయాణిస్తున్నాయి. "ప్రభూ! ఈరోజంతా వాళ్ళకే కష్టమూ బాధా కలగకుండా దీవించు స్వామి" అని చెప్పటానికన్నట్లుగా.

ఆ మందిర ప్రాంగణం, వీరేశలింగం పంతులుగారి ఆశయ ప్రతిరూపం పేరు.

అయితే... ఒక్కమాట.

"కుతూహలంతోనో, స్వార్థంగానో మీరక్కడికి వెళ్ళకండే, ఎందుకో చెప్పమంటారా."

"బాధను తీర్చలేని వారికి గుర్తులను రేపే హక్కు లేదు కనుక" అవునా మరి.

అర్ధగంట వరకూ జరిగే ఆ ప్రార్థనానంతరం, మెల్లగా లేచి నిశ్శబ్దంగా క్రమపద్ధతిలో మెట్లుదిగి తోటబాటగుండా నడచి హోమ్‌లోకి వెళ్ళిపోతారు ఎవరికి వారు.

అందరికన్నా చివర ఉండేది గంగ.

మాట్లాడే కళ్ళూ, వత్తయిన జుట్టూ, బేల మనసూ గంగ సొత్తు. రెండు మెట్లు దిగి అక్కడ కూర్చుని పై మెట్టుమీద ఆన్చిన మోచేతి మడతలో తలను పెట్టుకుని క్రిందరాలిన బొగడపూలను, గర్వంగా వెక్కిరించే తురాయి పూల మీదుగా, గంగ తన దృష్టి సారిస్తే—

చూపులు, తోట దాటి, గోదారిలో తడిసి గట్టు ఎక్కి క్రిందకు చూస్తే కనిపించే పల్లె. గతాన్ని చూపించి గుండెనూ, శరీరాన్ని వణికిస్తుంది.

జ్ఞాపకపు తెరలు నిట్టూరుస్తాయి.

"అయ్యో జానికమ్మ తల్లీ, నీకెంత కష్టము వచ్చిందే

అర్ధరాత్రి అర్ధాంతరంగా కన్నుమూసిన కారణమేమిటని అడగటానికి, నిలదీయడానికీ, ఆ చిదంబర రహస్యం వెలికి తీయటానికీ, సోదర బాలరాజు లెవరున్నారే నీకు?' అంటూ జాలిగా చూసే నిలువు గోడలే నేస్తాలు!

'శ్రీ వీరేశలింగ హితకారిణీ సమాజము'

సువిశాల స్థలములో రకరకాల ఫలవృక్షాల మధ్యగా గుండ్రంగా కట్టబడిన ప్రార్థనా మందిరమది.

అక్కడ ఏ దేవుని గుర్తులూ లేవు.

కులమత ప్రసక్తి లేదు.

అక్కడ అందరిదీ ఒకే కులం.

ఒకే జాతి.

'అది... బాధిత జాతి. పీడిత కులం'

అందులోని ఏ స్త్రీ గుండె వాకిట తలుపు తెరిచినా కనిపించేది — వేదనా లోగిటిలో, కన్నీటి కళ్ళాపులతో, చుక్కలు చెదిరి, గీతలు లేని ముగ్గులే.

నా తల్లీ! దేవుడెంత చిన్నచూపు చూసేడే" అంటూ శోకరాగాలు తీస్తూ గొంతు పెంచి—

"గంగా నువ్వెంత దిక్కులేని పిల్లవైపోయేవే నా చిట్టితల్లీ! మీ నాన్నకెంత ఘోరమైన చావొచ్చిందే నా తల్లీ" అంటూ—

చిన్నత్త పెద్దగా ఏడుస్తూ గుండెకు హత్తుకున్నప్పటి నల్లటి జ్ఞాపకపు మరక.

నాన్నని పొలం దగ్గర పొలం గొడవలలో నరికేశారు.

మరి అమ్మ?

ఎవరు కాదన్నా నేను ఒదులుకోగలనా?

ఒకే పేగుకు పుట్టిన బిడ్డలం అంటూ—

రెక్కలు తెగిన పక్షులనూ. గింజలనూ తన గూటికి చేర్చుకున్న మామయ్య మంచి వాడేనా? కాదా?

మరెందుకు చుట్టూ చేరిన జనం మామయ్య మాటలు విని అలా నోళ్ళు తెరిచి ఆశ్చర్యపోయారు అప్పుడు?

అయ్యో! గ్రహించే వయసా అది?

నరికి వేయబడిన నాన్న — అమ్మ కళ్ళముందు.

అర్థంకాని అయోమయపు బాధ — తన కళ్ళ ముందు.

ఇప్పుడు ఆలోచిస్తే?

'బహుశా!' బహుశా ఏమిటి? అవును,

బంగారం పండే భూమి — మామయ్య కళ్ళముందు.

మమకారం గొప్పదా? సంపద గొప్పదా?

పేగు తెంచుకుని పుట్టినపుడే, అర్థం బోధ పడటం లేదూ? బ్రతుకు తత్వం మామయ్య నీడలో, కాలపు దారాన్ని చుట్టుతూ, అమ్మొక పనిచేసే యంత్రంగా మారిపోయింది.

ఆశకు అంతమెక్కడ?

ఆస్తి అంతా తమ్ముడిపేరే ఎందుకు రాసింది?

'అయ్యో! వెర్రితల్లీ! తన చావుముందే తెలుసుకోవడానికి మీ అమ్మ ఏమైనా 'కాలజ్ఞాని' అనుకున్నావా?'

'అర్ధరాత్రి అర్ధాంతరంగా కన్నుమూసిన కారణమేమిటని అడగడానికి, నిలదీయడానికీ, ఆ చిదంబర రహస్యం వెలికి తీయటానికీ, సోదర బాలరాజు లెవరున్నారే నీకు?' అంటూ జాలిగా చూసే నిలువు గోడలే నేస్తాలు!

ఆనుకు కూర్చుని ఓదార్పు పొందడానికీనూ.

దేవుని కెందుకో అంత కసి, కొన్ని కొన్ని బతుకులంటే?!

పాడుపడుతున్న దేవాలయంలో పురాణమే కాలక్షేపం.

భక్తి ఎక్కడుందని!

జీర్ణిస్తున్న గోడల అడుగునెక్కడో, ఎప్పుడో సమాధి అయిపోతేనూ.

పురాణాలకు, పిట్టకథలు జోడించి చెప్తుంటే ఎంత హాయిగా వినేది తను! మోకాళ్ళ చుట్టూ చేతులు చుట్టుకుని గడ్డ మాన్చుకుని కూర్చుని.

తమగోడ పక్కన, ప్రక్కింటి వాళ్ళ పెరట్లో వున్న చెట్లనుండి దొంగిలించిన కొబ్బరికాయలు దేవుడికి కొట్టే అత్తకూడా భక్తిగా వచ్చేది పురాణ కాలక్షేపానికి.

అహకాదు. అత్తే తోడుగా తనను తీసుకువెళ్ళేది.

'పురాణాల్లో అంతమంది దేవుళ్ళూ, దేవతలూ వున్నారు. అందులో ఏ ఒక్కరు కరుణించి దీవించినా చాలు, తన కడుపునో కాయ పండటానికి' అనే ఆశతో.

వంశం. అవును మరి వంశం నిలవొద్దూ?

వయసు మళ్ళిన తర్వాత తమని చూడటానికో కొడుకు కావాలి.

వయసాగిన తర్వాత, తల కొరివి పెట్టటానికీ కొడుకు కావాలి.

చేసిన మోసాలకు, చచ్చిన తర్వాతనైనా, బంధువులు మొహం చూస్తారనే నమ్మకం లేదు మరి.

'ఆశ' మనిషిని నడిపిస్తుంది.

స్వార్థపు కోరలు పెట్టి మృగంగామా

**కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ**

తయారుచేస్తుంది.

గుడిలో శాస్త్రులు భారత కథ చెప్తూ, భాగీరథి గురించి చెప్తుంటే తనకెంత ఆశ్చర్యమేసేదని, అంతమంది పిల్లల్ని నీట ముంచి భీష్ముని వదిలేసింది భారతం నడపటానికా?

అందుకేనా భాగీరథీ పాత్ర సృష్టింపబడటం! ప్చ్ పాపం! అని ఎంత జాలిపడేది తను ఆ కథ వింటూ.

కానీ— ఆనాడు తెలియనే లేదు. తానూ ఓ భాగీరథీ కాబోతోందని. వయసయి పోతున్న అత్త కడుపునో కాయకాయలేదు కానీ, తనకి వయసు ముంచుకు వచ్చింది మహమ్మారిలా.

'పెళ్ళి'

"నష్టజాతకి దీనికి పెళ్ళా?!"

ఎవరు చేసుకుంటారు?"

'ఇక నాకు తప్పుతుందా?'

విశాలహృదయంతో వయసు మళ్ళిపోతున్న మామయ్య, పాత గుడిలో దండలపెళ్ళి చేసుకుంటే?!!

"అయ్యో పుత్తడిబొమ్మా పూర్ణమ్మా
చరిత్ర మారినా, కాలమెంత జారినా
కథలు మారవా తల్లీ
గతులు తప్పవా చెల్లీ
పూర్ణిమ వారసత్వం పృథ్వికి చేటోయన్నా" అంటూ—

శివమెత్తినట్లు వూగుతూ గాలి చెప్పే బుర్రకథకు బావురుమంటూ వంతపాడే గుడిగంటలు.

గుండెవుండీ జాలిపడీ ఆదుకునే మనిషెవడున్నాడనీ అక్కడ?

కలలు విరిగీ, కడుపు పండే, కసుకాయ వం[illegible] శాంకుంపైతే?

పంట పండించిన చేనుకు కోత.
జీవితాలెంత తేలిక? గడ్డి పరకల కన్నా!!!

ఏరుదాటిన తర్వాత తెప్పను తగులబెట్టాలి. అది ఒక సమాజం. యజమాని చేసే పాపాలన్నిటికీ కుడిభుజం కొండడు.

తాత, తండ్రులనాటినుండీ ఆ ఇంట ఉప్పుతిని విశ్వాసంగా పడున్న పాలేరు. వయసు పెరిగీ పాపపు భారంతో నడుము క్రుంగిపోతున్న ఇప్పుడు, చేసిన పాపాలు భయపెడ్తుంటే పుణ్యప్రీతితో చేసిన చిన్న సవరణే.



గంగను ఈ అనాథ శరణాలయంలో చేర్పించడం.

ఓ అర్థరాత్రి గంగను నెమ్మదిగా లేపి "ప్రాణముంటే ఎలుసాకు తినైనా బతకొచ్చు తల్లీ. పసికందును వదులుకోలేనంటే, అసలు ప్రాణానికే ముప్పు. ఎక్కడోచోట బతికి బాగుంటే, పెద్దయిన కొడుకుని మా రాజుగా చూసుకో వచ్చు తల్లీ" అంటూ పట్నంలో చదువుతున్న కొడుకుని తోడిచ్చి వూరు దాటించేడు.

గతంనిలిచి—

చూపులు వెనక్కిమళ్ళితే—

కన్నీటి వాగులు కళ్ళను దాటి, చెక్కిళ్ళ పాయలు మీదుగా

గుండె సముద్రం లోకి

అయ్యో! 'గంగా గర్జించలేదెందుకూ?' అని ఎవరైనా అనుకుంటున్నారా?' గంగ సమాధానం చెప్పదు.

అవునండీ—

గంగ మూగది మరి.

సీత కాలం నుండీ ఇలా ఓదార్చటం నాకలవాటే అంటూ—

అశోక చెట్టుమీద నుండి వచ్చేగాలి, నెమ్మదిగా గంగ ముంగురులను సవరిస్తూ ఓదార్పు నిస్తోంది.

అంతకుముందు అక్కడ జరిగిన ప్రార్థనా శబ్ద తరంగాలు గాలిలో చేరి ఆకాశం వైపుగా—

పైకి... పై....పైకి
"రఘుపతి రాఘవ రాజారాం
పతీత పావన సీతారాం" అంటూ—

ఆకాశంలో మేఘాల చాటునుండి
చేయి, చేయి పట్టుకుని క్రిందికి చూస్తున్న
వీరేశలింగం, గాంధీలు
హసిస్తున్నారా?! విలపిస్తున్నారా?!!

*